సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 6 । డిసెంబర్ । 2023



బాలికల ఆరోగ్యానికి భరోసా ఏది?

విద్యార్థినులకు ఎదురవుతున్న సమస్యలు దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఆరోగ్యకిట్ల పంపిణీపై గందరగోళం నెలకొంది. 8లో▸

రేపు గ్రహణమొర్రి వైద్యశిబిరం

ఆదిలాబాద్‌టౌన్‌: ఈ నెల 7న గ్రహణమొర్రి ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్ ప్రకటనలో తెలిపారు. బసవతారకం స్మైల్ ట్రెయిన్ సెంటర్, బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో సమగ్ర శిక్ష డాక్టర్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
24.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముగ్గురు ఉపాధ్యాయులపై చార్జెస్ ఫ్రేం

ఆదిలాబాద్‌టౌన్‌: స్పౌజ్ కేటగిరీని దుర్వినియోగం చేసిన ముగ్గురు ఉపాధ్యాయులపై విద్యాశాఖ కొరడా ఝుళిపించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈవో ప్రణీత చర్యలు చేపట్టారు. తలమడుగు మండలంలోని కజ్జర్ల ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, దేవాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ఇచ్చోడలో పని చేస్తున్న మరో ఉపాధ్యాయుడిపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఫ్రేం జారీ చేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సదరు ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్ దగ్గరగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉండగా వీరు అందుకు విరుద్ధంగా తమకు అనుకూలంగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. ఈ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారులు బదిలీ ప్రక్రియలో భాగంగా జీఓ నంబర్ 5ను విడుదల చేశారు. అలాగే పత్రికాముఖంగా, సెల్‌ఫోన్‌లకు మేసేజ్‌ల ద్వారా సమాచారమందించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురిపై పలువురు వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన డీఈవోను రిపోర్టుకు ఆదేశించారు. తదనుగుణంగా డీఈవో చర్యలు చేపట్టారు.

'నిరంకుశ పాలనకు చరమగీతం'



సంబరాల్లో పాల్గొన్న నాయకులు

ఎదులాపురం:కేసీఆర్ నిరంకుశ పాలనపై విసుగుచెందిన రాష్ట్ర ప్రజలు చివరకు ఓటుతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడారని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపొందిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం భుక్తాపూర్‌లో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు నళినిరెడ్డి, నాయకులు అరుణ్‌కుమార్, కట్ట కృష్ణ స్వామి, మర్రి వెంకటస్వామి, బెజ్జంకి నర్సింగరావు, షేక్ పాషా, అమీనా బేగం, సలీం బాయ్, జహీర్, కిషన్, లతాగౌడ్, పెద్ది నర్సింహులు పాల్గొన్నారు.


ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తూ..

ఆదిలాబాద్‌: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురు అధికారులు, ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే టీఎన్జీవోస్ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అధికారులు శ్రీనివాస్, రాజలింగు, నరేందర్ రాథోడ్, కిషన్, మిల్కా, సునీత, శ్రీనివాస్, సాధన, శ్రీధర్, శ్రీకాంత్, టీఎన్జీవోఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్ తదితరులున్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



తనిఖీలో పాల్గొన్న అనూష తదితరులు

నార్నూర్‌: మండలంలోని జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాలను పర్యవేక్షణ క్రమశిక్షణ బృందం ప్రతినిధి అనూష ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయం, వంటగది, క్రీడా మైదానం, తరగతి గదులను పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం చౌహాన్ నెహ్రూ, పీడీ విశ్వనాథ్, తదితరులున్నారు.

కొత్త ఎమ్మెల్యేలపై కోటి ఆశలు!



- ఉమ్మడి జిల్లాలో సమస్యలు అనేకం
- చొరవతోనే అభివృద్ధి వేగం
- హామీల అమలుపైనే అందరి దృష్టి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్త ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ఇక్కడి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో శాసనసభ్యుల పాత్ర కీలకం. కొత్తగా ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల చొరవే ఆ ప్రాంత అభివృద్ధిపై ఆధారపడనుంది. నియోజకవర్గాలకు నిధుల విడుదల, సద్వినియోగం తదితరాలన్నీ సమగ్రంగా సాగితేనే వచ్చే ఐదేళ్లు సాఫీగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఏ పని చేయాలన్నా, అధికారులు, ప్రజల ప్రతినిధిగా ఎంతో నిబద్ధతతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో పది మంది ఎమ్మెల్యేలు తమ బాధ్యతను నెరవేర్చాల్సి ఉంటుంది. తమ ప్రాంత ప్రజల ఆశయాలు తీర్చేందుకు చట్ట సభలో గొంతెత్తాల్సి ఉంటుంది. శాసనాల రూపకల్పనలో ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలి. అడవుల జిల్లాగా ఉన్న ఈ ప్రాంతంలో మిగతా జిల్లాలతో పోలిస్తే ఇంకా వెనకబాటే కనిపిస్తోంది. కొత్త ప్రభుత్వంలో మరింత అభివృద్ధి సాగాలని ఇక్కడి వారంతా కోరుకుంటున్నారు.

తీరని సాగునీటి గోస

ఉమ్మడి జిల్లాలో నేటికీ సాగునీటి గోస తీరలేదు. ఇప్పటికీ వర్షాధారంతో పత్తి, ఆరుతడి పంటలపైనే ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల రైతాంగం ఆధారపడుతున్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అటకెక్కడంతో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ప్రత్యామ్నాయంగా సాగునీటి ప్రాజెక్టులే లేకుండా పోయింది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ప్రాణహిత, గోదావరి తీర ప్రాంతాలకు వరదముంపు తప్పడం లేదు. ఆదిలాబాద్ నియోజకవర్గపరిధిలో చనాఖా కొరటా నిర్మాణం, ఖానాపూర్ నియోజకవర్గంలో కడెం ప్రాజెక్టు ఆధునికీకరణ, మంచిర్యాల జిల్లాలో గూడెం ఎత్తిపోతలు, ఆసిఫాబాద్‌లో కుమురంభీం, పెద్దవాగు, వట్టివాగు ఆధునికీకరణలు, సిర్పూర్‌లో జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు, నిర్మల్ నియోజకవర్గంలో సరస్వతీ కాలువ ఆధునికీకరణ పూర్తి చేయాల్సి ఉంది.

ఏజెన్సీలో తీరని సమస్యలు..

గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ రోడ్ల సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. చాలాచోట్ల అటవీ అనుమతులు రాక కొత్త రోడ్లకు మోక్షం కలగడం లేదు. ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత, ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది లేమితో విద్య, వైద్యం అందని ద్రాక్షగానే మారింది. పీహెచ్‌సీలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సరిపడా ఉండడం లేదు. ముఖ్యంగా స్పెషలిస్టు వైద్యులు లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. జిల్లా ఆసుపత్రుల్లోనూ ఇంకా వైద్య సౌకర్యాలు మెరుగుపడాల్సి ఉంది.

ఉపాధి పెరగాలి

ఉమ్మడి జిల్లాలో సహజ వనరులు, ముడిసరుకు లభ్యత ఉన్నా ఇంకా ఫ్యాక్టరీలు, కొత్త కంపెనీల స్థాపన అందని ద్రాక్షగానే మారింది. మంచిర్యాల, ఆసిఫాబాద్ పరిధిలోని ప్రభుత్వ రంగసంస్థ సింగరేణిలో కొత్తగనుల ప్రారంభం, ఉద్యోగాల కల్పన మెరుగుపడాల్సి ఉంది. జిల్లా కేంద్రాలైన ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల పట్టణాల్లో పరిశ్రమల స్థాపనకు ఊతమివ్వాలి. ఆదిలాబాద్, మంచిర్యాల, ఐటీ హబ్‌ల ఏర్పాటు వేగవంతం చేయాల్సి ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పలు పరిశ్రమలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు, ఐటీ హబ్‌లు, నైపుణ్య శిక్షణ సంస్థలు, స్వయం ఉపాధి కల్పనకు కృషి చేయాల్సి ఉంది. ఇక్కడి యువతకు మరింత ప్రోత్సాహం అందించాల్సి ఉంటుంది.

పట్టణాలపై దృష్టి పెట్టాలి

ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గ కేంద్రాలు, పట్టణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. ఇక్కడే జనాభా అధికంగా నివసిస్తుండడంతో మున్సిపాలిటీల అభివృద్ధిపై రూట్ మ్యాప్‌తో ముందుకెళ్లాలి. చాలాచోట్ల అభివృద్ధి మొదలైనా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. కొత్త మున్సిపాలిటీల పరిస్థితి మెరుగుపడడం లేదు. తాగునీరు, నాలాలు, ఆక్రమణలు, జంక్షన్లు,ట్రాఫిక్ ఇబ్బందులున్నాయి. వ్యాపారులు, వాణిజ్యం ప్రక్రియసాగేందుకు మరింత చొరవ చూపాల్సి ఉంది. రవాణా వేగం పెంచేందుకు రోడ్లు, రైల్వే మార్గాల్లో ప్రజలు అందుబాటులోకి తీసుకురావాలి. ఇక ప్రభుత్వ భూములు, ఆస్తుల రక్షణ కోసం కబ్జాలు, అవినీతి నిరోధించడం, ప్రజలకు జవాబుదారీ పాలన అందించేందుకు స్థానిక ఎమ్మెల్యేలు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కైలాస్‌నగర్‌: మహిళలు వృత్తి నైపుణ్య కోర్సులను సద్వినియోగం చేసుకుంటే కుటుంబ పోషణలో భాగస్వాములు కావచ్చని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక భాగ్యనగర్ కాలనీలోని కేంద్ర వృత్తి నైపుణ్య అభివృద్ధి మంత్రిత్వ శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న జన శిక్షణ సంస్థ పాలక వర్గ సమావేశాన్ని సంస్థ చైర్మన్ మమత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందడం ద్వారా ఆర్థిక స్వయం సమృద్ధిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కరప్రసాద్, సేడ్స్ డైరెక్టర్ ఆర్ సురేందర్, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజన్న, శశికళ, మసూద్, అన్వరి పాల్గొన్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్‌: 2024 సంవత్సరంలో హజ్‌యాత్రకు వెళ్లేవారు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో గల జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9849214764, 9394354477 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వణికిస్తున్న మిచాంగ్

- జిల్లాపై తుపాన్ ప్రభావం
- ఈదురుగాలులతో జనం అవస్థలు

ఆదిలాబాద్‌టౌన్‌: మిచాంగ్ తుపాను ప్రభావం జిల్లాపై పడింది. దీంతో రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. చలి తీవ్రత తక్కువగా ఉన్నా ఈదురుగాలులతో జనం అవస్థలు పడుతున్నారు. భానుడు మేఘాలు దాటి బయటకు రావట్లేదు. వర్షం కురవనప్పటికీ మబ్బులు కమ్ముకుని చీకటిని తలపిస్తోంది. వాతావరణ మార్పులతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. శీతల గాలులతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. అస్తమా, శ్వాసకోశ వ్యాధిగ్రస్తుల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

రెండు రోజులుగా ఈదురుగాలులు

జిల్లాలో రెండు రోజులుగా ఉదయం నుంచి రాత్రి వరకు మబ్బులతో కూడిన వాతావరణానికి తోడు ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో జనం ఇంటి నుంచి బయటకు రావడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్తున్న వారు పట్ట పగలు కూడా స్వెటర్లు, మంకీ క్యాపులు, మఫ్లర్లు ధరిస్తున్నారు. దీంతో వీటికి గిరాకీ భారీగా పెరిగింది. ఇదిలా ఉంటే జిల్లాలో సోమవారం కనిష్ట ఉష్ణోగ్రత 18.2 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రత 31.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో ఉష్ణోగ్రతలు పది డిగ్రీల వరకు పడిపోగా శీతల గాలులు లేకపోవడంతో చలి వణికించింది. ప్రస్తుతం చలి తీవ్రత అంతగా లేకపోయినా ఈదురుగాలులతో జనం వణుకుతున్నారు.



చలి మంట కాగుతున్న జనం

చలి మంటలు కాగుతున్న జనం

ఈదురుగాలులతో కూడిన చలి నుంచి ఉపశమనం పొందేందుకు జనం చలి మంటలు కాగుతున్నారు. ఉదయం నుంచిరాత్రి వరకు ఇళ్లల్లో కుంపట్లు పెట్టుకుంటున్నారు. అటవీప్రాంతం ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది.

అప్రమత్తంగా ఉండాలి



వాతావరణ మార్పుల కారణంగా జనం కొంత ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, అస్తమా రోగులు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైతే తప్ప బయటకు రాకూడదు. నిమోనియా, అస్తమా బాధితులు చలి తీవ్రత తక్కువున్నప్పుడే బయటకు వెళ్లాలి. వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలి. ఇబ్బందులుంటే వైద్యులను సంప్రదించాలి.

– డా.క్రాంతి, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

రిజిస్ట్రేషన్లు పుంజుకునేనా..?

- గడిచిన రెండు నెలల్లో తగ్గిన ఆదాయం
- ముగిసిన ఎన్నికల కోడ్
- రియల్ వ్యాపారం పెరిగే అవకాశం
- సర్కారు ఖజానాపై ప్రభావం



ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

కైలాస్‌నగర్‌: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భూములు, ప్లాట్ల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లు ఆశించిన స్థాయిలో కాలేదు. మోడల్ కోడ్ అమలు కారణంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తుండటంతో ప్రజలు వాటి కొనుగోలుకు ఆసక్తి చూపలేదు. దీంతో జిల్లాలో రియల్ వ్యాపారం భారీగా పడిపోయింది. ఫలితంగా సాధారణ సమయంలో అయ్యే రిజిస్ట్రేషన్ల సంఖ్యతో పోలిస్తే ఎన్నికల సమయంలో భారీగా తగ్గాయి. తాజాగా ఎన్నికల సంఘం మోడల్ కోడ్ ఎత్తివేయడంతో రియల్ వ్యాపారం మళ్లీ జోరందుకోనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

కోడ్‌తో కొనుగోలుకు వెనుకడుగు

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు గాను కేంద్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 9న షెడ్యూల్ ప్రకటించింది. అప్పటినుంచే జిల్లాలో ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చింది. మద్యం, డబ్బు కట్టడి కోసం అధికార యంత్రాంగం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసులతో తనిఖీలు ముమ్మరం చేసింది. రూ.50వేలకు మించి తీసుకెళ్లిన నగదును స్వాధీనం చేసుకోవడంతో జిల్లాలో భూములు, ప్లాట్లు, ఇళ్ల క్రయ విక్రయాలు భారీగా తగ్గాయి. పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రజలు వాటి కొనుగోలుపై ఆసక్తి చూపలేదు. దీంతో క్రయ, విక్రయాలు నెమ్మదించాయి. నిత్యం కిటకిటలాడే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఎన్నికల సమయంలో రెండు నెలల పాటు బోసిపోయి కనిపించాయి.

రూ.4.64 కోట్ల ఆదాయం

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అక్టోబర్ 9నుంచి ప్రక్రియ ముగిసే డిసెంబర్ 4 వరకు జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.4.64 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. ఇందులో ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా రూ.4.51 కోట్ల ఆదాయం సమకూరగా, బోథ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో కేవలం రూ.13 లక్షల ఆదాయం మాత్రమే వచ్చినట్లుగా సబ్ రిజిస్ట్రార్లు వెల్లడించారు. ఇదే సమయంలో గతేడాది రెండు కార్యాలయాల్లోనూ రెట్టింపు ఆదాయం వచ్చినట్లుగా చెబుతున్నారు. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో రియల్ వ్యాపారం తిరిగి జోరందుకునే అవకాశం ఉందని రియల్టర్లు పేర్కొంటున్నారు. దీంతో సర్కారు ఖజానాకు ఆదాయం పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

గడిచిన రెండు నెలల వ్యవధిలో జిల్లాలో రిజిస్ట్రేషన్లు, సర్కారు ఖజానాకు సమకూరిన ఆదాయం వివరాలు..

నెల	సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	రిజిస్ట్రేషన్లు	సమకూరిన ఆదాయం
అక్టోబర్	బోథ్	42	రూ.5లక్షలు
	ఆదిలాబాద్	721	రూ.2.72 కోట్లు
నవంబర్	బోథ్	58	రూ.8లక్షలు
	ఆదిలాబాద్	643	రూ.1.79కోట్లు

అసెంబ్లీకి 'తొలి' అడుగు

- ఉమ్మడి జిల్లా నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఏడుగురు
- పాత కాపులు ముగ్గురే



కైలాస్‌నగర్‌: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటర్లు విలక్షణ తీర్పునిచ్చారు. 2018 ఎన్నికల్లో ఏకపక్షంగా బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి తొమ్మిది మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ఓటర్లు ఐదేళ్లు తిరిగే నాటికి తమ మనసు మార్చుకున్నారు. ఆ పార్టీపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ బీజేపీ, కాంగ్రెస్‌కు సంబంధించి చెరో నలుగురు అభ్యర్థులను గెలిపించారు. అధికార బీఆర్ఎస్ అభ్యర్థులను రెండు చోట్ల మాత్రమే ఆదరించారు. నిర్మల్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మాత్రం ఇది వరకు ఎమ్మెల్యేలుగా పనిచేసిన మహేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి, గడ్డం వినోద్‌ను గెలిపించారు. అసెంబ్లీకి ఎన్నికైన పది మందిలో ఏడుగురు కొత్తవారే కావడం గమనార్హం. ఇందులో కొందరు తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలోకి అడుగు పెడుతుండగా, మరికొందరు పలు పరాజయాల అనంతరం విజయాన్ని అందుకుని శాసనసభలో అధ్యక్షా అనేందుకు సిద్ధమవుతున్నారు. వారెవరో పరిశీలిస్తే..



- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న పాయల్ శంకర్ ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి నాలుగో ప్రయత్నంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. మూడుసార్లు జోగు రామన్న చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ సారి 6,326 ఓట్ల ఆధిక్యంతో గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు.



- ఖానాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అనూహ్యంగా టికెట్ దక్కించుకుని బరిలో నిలిచిన వెడ్మ బొజ్జు మొదటి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌పై 4,289 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.



- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీగా పనిచేసి రాజకీయంగా చక్రం తిప్పిన కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మంచిర్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రెండో సారి బరిలో నిలిచి విజయాన్ని అందుకున్నారు. బీజేపీ అభ్యర్థి రఘునాథ్‌పై 66,116 ఓట్ల అధిక్యంతో గెలుపొంది తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



- బోథ్ నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీచేసిన అనిల్ జాదవ్ ఎట్టకేలకు ఈ సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థిగా రెండు సార్లు ఓటమి పాలైన ఈయన ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుపై 22,800 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు.



- సిర్పూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పాల్వాయి హరీశ్‌బాబు బీఆర్ఎస్ అభ్యర్థి కోనప్పపై 3,043ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయారు. రెండో ప్రయత్నంలో గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.



- చెన్నూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున తొలిసారి అసెంబ్లీ బరిలో నిలిచిన మాజీ ఎంపీ జి.వివేక్ వెంకట్‌స్వామి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై 36,618 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు.



- ముథోల్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన పవార్ రామారావు పాటిల్ సైతం తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై 23,419 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు.

క్లుప్తంగా

మతాల హద్దులు చెరిపేశారు..



అయ్యప్ప పూజలో పాల్గొన్న అబ్దుల్ రవూఫ్

బోథ్: మండలంలోని కౌఠబి గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు అబ్దుల్ రవూఫ్ మంగళవారం అయ్యప్ప స్వాములకు భిక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో కలిసి అయ్యప్ప పూజలో పాల్గొని మతాల హద్దును చెరిపేశారు. ఈ సందర్భంగా అబ్దుల్‌ను పలువురు అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడికి గాయాలు

దస్తురాబాద్: విద్యుత్‌షాక్‌తో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సిందం నాగచైతన్య (14) ఇంటి సమీపంలోకి వచ్చిన కోతుల గుంపును తరిమే క్రమంలో మరో ఇంటి స్లాబ్‌పై ఎక్కాడు. ఆ ఇంటిపై ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లను గమనించకపోవటంతో విద్యుత్‌షాక్‌కు గురికావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

పలు రైల్వే సర్వీసులు రద్దు

ఆదిలాబాద్: ఈ నెల 20వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్ణ–తిరుపతి వీక్లీ రైలును ఈనెల 12వ తేదీ నుంచి 13 వరకు, తిరుపతి–పూర్ణ వీక్లీ సర్వీస్‌ను ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా తిరుపతి–ఆదిలాబాద్ సర్వీసును మంగళవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ఆదిలాబాద్– తిరుపతి సర్వీసును ఈనెల 20వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మార్గాల్లో అభివృద్ధి, మరమ్మతు పనుల కారణంగా సర్వీసులను నిలిపివేయడం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

రిమ్స్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఉట్నూర్ మండలంలోని తంద్రా గ్రామానికి చెందిన సురేష్ (42) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఆసుపత్రికి నుంచి బయటకు వెళ్లి మద్యం సేవించి తెలంగాణ చౌక్‌లో పడిపోయాడు. స్థానికులు రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనుబోతు పిల్ల లభ్యం



లభ్యమైన మనుబోతు పిల్ల

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల శివారులో ఓ వ్యక్తికి మనుబోతు పిల్ల మంగళవారం రాత్రి లభ్యమైంది. అతడు అటవీశాఖ బీట్ ఆఫీసర్ ప్రశాంత్‌కు సమాచారం అందించి దానిని అప్పగించాడు. ఆ మనుబోతు పిల్లను అటవీశాఖ అధికారులు మావల హరిత వనం పార్కు వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ మావల అటవీ శివారు ప్రాంతంలోని వ్యవసాయ పొలంలో శునకాలు మనుబోతు పిల్ల వెంటపడడంతో గమనించిన మావల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దానిని రక్షించి తమకు సమాచారం అందించినట్లు తెలిపాడు.

బాలికల ఆరోగ్యానికి భరోసా ఏది?

- పంపిణీకి నోచుకోని కాస్మొటిక్ కిట్లు
- ఖాతాల దశలోనే నిలిచిన నగదు జమ
- విద్యార్థినులకు తప్పని ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	కేజీబీవీలు	విద్యార్థులు
ఆదిలాబాద్	17	4,080
మంచిర్యాల	18	3,435
నిర్మల్	19	5,787
కుమురంభీం	15	3,690



మంచిర్యాలఅర్బన్: బాలికా విద్యను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యార్థినులకు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని పంపిణీ చేస్తున్న ఆరోగ్య కిట్ల పంపిణీపై గందరగోళం నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి, పేదరికం వల్ల ఎంతోమంది విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేకంగా పరిశుభ్రత కిట్ల (కాస్మొటిక్ కిట్లు) పంపిణీ చేపట్టింది. కరోనాతో నేపథ్యంలో రెండేళ్లపాటు కిట్లు పంపిణీ చేయలేదు. ఆ తర్వాత కాలంలో మూణ్నెళ్లకోసారి ఇస్తూ వస్తున్నా ఎనలేని జాప్యం నెలకొంది. గతేడాది ఆరోగ్య కిట్ల స్థానంలో నగదు పంపిణీ చేసేందుకు విద్యార్థినుల చేత బ్యాంకులో ఖాతాలు తెరిపించారు. అటూ ఆరోగ్యకిట్లు.. ఇటు నగదు చెల్లింపులపై ఎటూ తేల్చకుండా పోయింది. ఈఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరునెలలు పూర్తికావస్తున్నా ఇప్పటికీ పంపిణీ చేయకపోవడంతో బాలికలకు ఎదురుచూపులు తప్పడంలేదు.

కస్తూరిబాలో అధికారుల తనిఖీ

జన్నారం: మండలంలోని కస్తూరిబా పాఠశాలలో మంగళవారం అధికారులు ప్యానల్ తనిఖీలు చేశారు. అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో 14 మంది సభ్యులు అడ్మినిస్ట్రేటివ్, అకాడమీకి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థినులపై తీసుకునే జాగ్రత్తలు వివరించారు. హాస్టల్ నిర్వహణపై పలు అంశాలను సూచించారు. సమావేశంలో పాఠశాల ప్రత్యేక అధికారి శ్రీవాణి, అకౌంటెంట్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న అధికారులు

ఆరోగ్యకిట్లు ఇలా..

కేజీబీవీలో ఆరు నుంచి (ఆదర్శ పాఠశాలలో ఏడు నుంచి) ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థినులకు ఆరోగ్య కిట్లు అందజేస్తున్నారు. సర్కారు పాఠశాలలో ఉచిత విద్యాబోధన.. పాఠ్యపుస్తకాలు.. రెండు జతల యూనిఫాంతో పాటు మధ్యాహ్నం భోజనం వంటి కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం 2017–18 విద్యాసంవత్సరం నుంచి బాలికల ఆరోగ్యానికి భరోసా నిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పేదింటి ఆడపిల్లలకు విద్యతో పాటు ఆరోగ్య కిట్లను పంపిణీ చేస్తూ వచ్చారు. మొదట మంచిర్యాల జిల్లాలోని కేజీబీవీల్లో ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. మరుసటి ఏడాది నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అందజేశారు. కరోనా వ్యాప్తితో ఆరోగ్యకిట్ల పంపిణీ అటకెక్కింది.

మూణ్నెళ్లకు ఒకసారి..

ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్యకిట్లు మూణ్నెళ్లకు ఒకసారి విద్యార్థులకు అందించాల్సి ఉంది. మాయార్న్ అండ్ ఫైబ్రిస్ అనే సంస్థ నేరుగా ఎంఈవోలకు సరఫరా చేస్తోంది. అక్కడి నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చేరుతాయి. ఆ తర్వాత విద్యార్థినులకు పంపిణీ చేసేవారు. ఇందులో బాత్‌సోప్స్–3, డిటర్జెంట్ సోప్స్–3, హెయిర్ ఆయిల్ బాటిల్–1, షాంపు బాటిల్–1, పౌడర్ డబ్బా –1, టూత్‌పేస్ట్ –1, టంకుక్లీనర్–1, దువ్వెన –1, జడ క్లిప్పులు, జడ రబ్బర్లు, బొట్టుబిళ్లల ప్యాకెట్, శానిటరీ న్యాప్‌కిన్లతో పాటు 16 రకాల వస్తువులు పంపిణీ చేశారు. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులే చదువుతుంటారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థినులు కౌమారదశలో ఉంటారు. నెలనెలా వారికి అవసరమయ్యే న్యాప్‌కిన్లు కొనలేని పరిస్థితి. దీంతో పాఠశాలకు కూడా గైర్హాజర్ అవుతుంటారు. న్యాప్‌కిన్లకు బదులు ప్రత్యామ్నాయాలు వాడుతుండడంతో ఆరోగ్య సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతినెలా శానిటరీ న్యాప్‌కిన్లతో పాటు పలు వస్తువులతో కూడిన ఆరోగ్య కిట్లు అందించాలని నిర్ణయం తీసుకుంది.

అంతా గందరగోళం..

బాలికల ఆరోగ్య సమస్యలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017–18 విద్యా సంవత్సరం నుంచి ప్రతిష్టాత్మకంగా 16 రకాల వస్తువులతో హెల్త్ కిట్లు అందజేస్తోంది. గతంలో నెలకు రూ.100 చొప్పున అందజేసేవారు. తర్వాత కాలంలో విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో నగదుకు బదులు ఆరోగ్య పరిశుభ్రత కిట్లు పంపిణీ చేస్తూ వస్తోంది. కరోనా కాలం నుంచి కిట్ల పంపిణీకి బ్రేక్ పడింది. గతేడాది కిట్లకు బదులు నగదు పంపిణీకి యోచించినట్లు తెలుస్తోంది. విద్యార్థినులు బ్యాంకు ఖాతాలు తెరవాలని ఆదేశాలు రావడంతో అంతా పూర్తి చేశారు. ఏడాది గడిచిపోవడంతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు వెళ్లిపోయారు. ఈ ఏడాది కొత్తగా ఆరోతరగతిలో ప్రవేశం పొందారు. కొత్తగా ఆరోతరగతిలో చేరిన విద్యార్థినుల బ్యాంకు ఖాతాలు తెరవలేదు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులకు ఏవిధంగా చెల్లింపులు చేస్తారో తెలియకుండా పోయింది. అర్నెళ్లు కావస్తున్నా నగదు చెల్లింపు ఊసేలేకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక వేళ చెల్లింపులు చేసినా బ్యాంకు ఖాతాలు లేని బాలికల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. టెన్త్, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినుల జాబితా అలాగే ఉండడంతో వారిని తొలగించడం ఎలాగో తెలియకుండా అంతా గందరగోళంగా మారింది. ఈలెక్కన నగదు చెల్లింపు కంటే ఆరోగ్య కిట్ల పంపిణీ సరైందని తెలుస్తోంది. దీనిపై సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తిని సంప్రదించగా బాలికలకు అందజేసే ఆరోగ్య కిట్ల సరఫరా.. స్టైఫండ్ చెల్లింపులపై ఆదేశాలు రాలేదని, పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



రజత పతకంతో లోహిత్

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడాకారుడు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను కనబరిచాడు. హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో లోహిత్ సాయి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 50మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 200 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్లలో విజేతగా నిలిచాడని స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ తెలియజేశారు.

ఒకరికి ఆరునెలల సాధారణ జైలు

- రూ.11వేల జరిమానా

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మరణానికి కారకుడైన నిర్మల్ జిల్లాకు చెందిన గిరి రామకృష్ణకు ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.11000 జరిమానాను విధిస్తూ నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ మంగళవారం తీర్పును వెల్లడించాడు. పోలీసుల వివరాల ప్రకారం... కడ్తాల్ గ్రామానికి చెందిన పల్లికొండ ప్రశాంత్(22), పట్టి సాగర్ ఇరువురు బైక్‌పై 2014లో నిర్మల్ నుంచి కడ్తాల్ వస్తున్నారు. అదే సమయంలో గిరి రామకృష్ణ కారులో అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న బైకును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రశాంత్ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఫి ర్యాదు మేరకు అప్పటి ఎస్సై పి.మహేందర్, ఏఎస్సై ఎస్‌కే అంజాద్ అలీ కేసు నమోదు చేశారు. తొమ్మిది మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు శిక్షను విధించింది.

సోనియాగాంధీని కలిసిన వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన పోటీ చేసి ఎమ్మెల్యేగా వినోద్ ఎన్నికయ్యారు. ఎన్నికల్లో తనకు పోటీ చేసే అవకాశం కల్పించిన సోనియాగాంధీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

బెల్లంపల్లిరూరల్: లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోర్లకుంట శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం తన సొంత పని నిమిత్తం బెల్లంపల్లి మండలం కన్నాల జాతీయ రహదారి వైపు నడుచుకుంటూ వెళ్లాడు. రోడ్డు దాటుతున్న క్రమంలో మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించినట్లు సమాచారం. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సంఘటన స్థలంలో శ్రీనివాస్

రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం హైదరాబాద్ బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్‌లో నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్‌లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అనే అంశంలో రాష్ట్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఇందులో జోసెఫ్ కాన్వెంట్ ఉన్నత పాఠశాల విద్యార్థి దర్శన్ కుమార్, మహాత్మా జ్యోతి బాపూలే ఈదుల్లా సావర్‌గాంవ్ విద్యార్థి ఎల్.శ్రావణి, లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఏ.సాయి తేజస్వీని ప్రదర్శనిచ్చారు. పర్యావరణ హితం కోసం వ్యర్థ పదార్థాల వినియోగం, సామాజిక స్థితిగతుల మార్పు, నిర్వహణ అనే అంశాలపై విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విశ్లేషణ అందించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రతిభ చాటిన సదరు విద్యార్థులను డీఈఓ ప్రణీత అభినందించారు. వారి వెంట జిల్లా సైన్స్ అధికారి కె.రఘు రమణ, ఎన్‌సీఎస్‌సీ జిల్లా అకాడమిక్ కో ఆర్డినేటర్ ఆరె భాస్కర్ , గైడ్ టీచర్స్ వినోద్, సుశాంత్‌రెడ్డి, రత్నబాయి పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో డీఎస్‌ఓ రఘు రమణ

నేడు జోనల్‌స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో అండర్–17 బాలికల జోనల్ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల జట్లు ఉదయం 10 గంటల్లోగా రిపోర్టు చేసేలా సంబంధిత జిల్లాల పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శులు సహకరించాలని సూచించారు. ఇతర వివరాలకు గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డిని 9440010453, హ్యాండ్ బాల్ క్రీడా శిక్షకుడు చునార్కర్ అరవింద్‌ను 9550909870 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్సార్పీ 3, 3ఏ గనిలో కార్మికునికి గాయాలు



చికిత్స పొందుతున్న రామకృష్ణ

శ్రీరాంపూర్ (మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 3, 3ఏ గనిలో విధుల్లో ఉన్న జనరల్ మజ్దూర్ కార్మికుడు రామకృష్ణకు ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. మంగళవారం మొదటి షిఫ్ట్ విధులకు హాజరైన కార్మికుడు గని భూగర్భంలోని 3 సీమ్, 11 లెవల్ ఎండ్‌లెస్ వద్ద పనిచేస్తుండగా టబ్బు తాడు పుల్లీ నుంచి బయటికి వచ్చింది. దానిని పుల్లీపై చర్చే క్రమంలో తాడు బలంగా తాకడంతో గడర్‌కు కాలు ఢీకొట్టింది. ఘటనలో కార్మికుడి ఎడమ కాలు విరిగింది. వెంటనే తోటి కార్మికులు హుటాహుటిన గని ఉపరితలానికి తీసుకువచ్చి రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పత్తి దగ్ధం

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని తంగళ్లపల్లిలో ప్రమాదవశాత్తు పత్తిపంట దగ్ధమైంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రత్నం మల్లయ్య తన ఇంటివద్ద 30 క్వింటాళ్ల పత్తిని నిల్వ ఉంచుకున్నాడు. మంగళవారం ప్రమాదవశాత్తు పత్తికి నిప్పంటుకోవడంతో గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు నీళ్ల చల్లి మంటలు ఆర్పివేశారు. ఘటనలో రూ.37 వేల విలువచేసే 5 క్వింటాళ్ల పత్తి దగ్ధమైందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం అందించాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్ రాగివైర్లు చోరీ

- కన్కపూర్ ఎత్తిపోతలకు నిలిచిన విద్యుత్ సరఫరా
- పోలీసులకు, విద్యుత్‌శాఖ ఏఈకి ఫిర్యాదు

లోకేశ్వరం: ఎత్తిపోతల పథకం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రాగి వైర్లు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎత్తిపోతల పథకం కమిటీ చెర్మన్ కట్ట నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలంలోని కన్కపూర్ గ్రామ పరిధిలోని గోదావరి నది ఒడ్డున గల బ్రహ్మేశ్వరాలయం వద్ద 20ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసింది. ఈ పథకం ద్వారా మండలంలోని కన్కపూర్, అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, ముథోల్ మండలంలోని చింతకుంట గ్రామాల భూమలకు సాగు నీరందుతోంది. ఎత్తిపోతల పథకం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన దాదాపు రూ.2లక్షల విలువ చేసే రాగి విద్యుత్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించి మంగళవారం ఎస్సై సాయికుమార్, మండల విద్యుత్ ఏఈ శివకుమార్, ఇరిగేషన్ శాఖ అధికారులలు ఫిర్యాదు చేశారు. ఖరీఫ్ పంటలు ముగియడంతో నెల రోజుల క్రితం ఆ పథకం ద్వారా నీటి సరఫరాను నిలివేశారు. రబీ సీజన్ కోసం రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు వీలైనంత త్వరగా విద్యుత్‌ను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



చోరీకి గురైన విద్యుత్ రాగి పట్టీలు

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన విద్యుత్ ఏఈ శివకుమార్

మండలంలోని కన్కపూర్ ఎత్తిపోతల పథకాన్ని లోకేశ్వరం విద్యుత్ ఏఈ శివకుమార్ పరిశీలించారు. చోరీకి గురైన ఎత్తిపోతల పథకం విద్యుత్ పరకాలను పరిశీలించి టీఎస్ ఐడీసీశాఖ అధికారులకు చోరీ విషయమై నివేదికలను పంపించామని వారు తెలిపారు.

పులి దాడిలో మూగజీవాలు హతం



ఎద్దు కళేబరం



ఆవు కళేబరం

- సంకారం అటవీ ప్రాంతంలో ఆవు, ఎద్దుపై దాడి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సంకారం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పులి దాడిలో రెండు మూగజీవాలు హతమయ్యాయి. గ్రామానికి చెందిన మడె అర్జయ్య, మడె పెద్ద మల్లయ్యకు చెందిన ఒక ఎద్దు, ఆవు సోమవారం పశువుల మందతో కలిసి సోమవారం మేతకు వెళ్లాయి. సాయంత్రం ఇంటికి తిరిగిరాకపోవడంతో మంగళవారం ఉదయం అటవీ ప్రాంతంలోకి వెళ్లి చూడగా ఎద్దు, ఆవు కళేబరాలు కనిపించాయి. గత నెలలో వేమనపల్లి మండలంలో సంచరించిన పులి ఇటు వైపుగా వచ్చి ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సంకారం అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న మాట వాస్తవమేనని, అటవీ ప్రాంతంలోకి పశువులను తోలుకెళ్లే కాపర్లు జాగ్రత్తగా ఉండాలని ఎఫ్ఆర్వో శివకుమార్ సూచించారు. పులి దాడిలో హతమైన పశువులకు నష్ట పరిహారం ఇప్పించాలని యజమానులు కోరుతున్నారు.

సంఘవిద్రోహ శక్తులకు సహకరించొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ



ప్రాణహిత ఫెర్రి పాయింట్‌ను పరిశీలిస్తున్న సీఐ

- చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్

వేమనపల్లి:ప్రజలు సంఘవిద్రోహ శక్తులకు సహకరించొద్దని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా కళ్లెంపల్లి గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఏదైన సమస్యలు ఉంటే 100కు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లోకి అపరిచిత , అనుమానిత వ్యక్తులు వస్తే ఆశ్రయం ఇవ్వొద్దని కోరారు. వాహనపత్రాలు లేని 18 బైక్‌లు ఒక ఆటోను సీజ్ చేశారు. ఆయన వెంట ఎస్సై సుబ్బారావు, ఆర్ఎస్ఐ వెంకట్, పోలీసులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

మందమర్రిరూరల్: విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఈశ్వరయ్య అధికారులను ఆదేశించారు. మండలంలోని అందుగులపేట సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సబ్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. మందమర్రి విద్యుత్ శాఖ ఏఈ మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేదికలో అధికారులు రామకృష్ణ, కిషన్, శేషారావు, కైసర్, శ్రీనివాస్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న ఈశ్వరయ్య

రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ రాజీనామా

దండేపల్లి: రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ మోటపల్కుల గురువయ్య తన పదవికి, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మంగళవారం రాజీనామా చేశారు. మండలంలో ని ముత్యంపేట రైతుబంధు సమితి మండల, గ్రామ కమిటీల నాయకులతో కలిసి మంగళవారం మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ తీసుకు న్న అనాలోచిత నిర్ణయాలతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. ఇందుకు నిరసనగా తనతోపాటు, పలువురు రైతుబంధు సమితి సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పదవులకు, పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేసినట్లు తెలిపారు. తమ రాజీనామాలను వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. రాజీనామా చేసిన వారిలో రైతుబంధు సమితి మండల సభ్యుడు ఇప్ప రమేశ్, బీఆర్ఎస్ ముత్యంపేట గ్రామ అధ్యక్షుడు ముత్తె బాపు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ ఉన్నారు.

సొంత భవనాలు కరువు

- అద్దెభవనాల్లో కార్యాలయాలు
- మరికొన్ని ఇరుకు గదుల్లో నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



చిన్నగదిలో కొనసాగుతున్న వ్యవసాయ శాఖ కార్యాలయం

నార్నూర్: పాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం గాదిగూడ మండలాన్ని ఏర్పాటు చేసింది. మొత్తం 25 పంచాయతీలు ఉన్నాయి. ఉమ్మడి మండలం నుంచి గాదిగూడ మండలాన్ని ఏర్పాటు చేసి ఐదేళ్ల వుతున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. కొన్ని కార్యాలయాలు అద్దెభవనంలో, మరికొన్ని ఇరుకుగదిలో నిర్వహిస్తున్నారు. తహసీల్దార్, ఎంఈవో, ఐకేపీ, వ్యవసాయశాఖ కార్యాలయాలు ఇరుకుగదిలో కొనసాగుతోంది. ఏదైన సమావేశాన్ని నిర్వహించాలన్నా కష్టంగా మారింది. కనీసం ఐదు కుర్చీలు పెట్టే పరిస్థితి లేదు. పశువైద్య ఆస్పత్రి ఒక గదిలో నిర్వహిస్తుండడంతో మందులు పెట్టుకోవడానికి ఇబ్బందిగా మారింది. పోలీస్‌స్టేషన్ ఎస్సీ బాలుర వసతి గృహంలో కొనసాగుతోంది. పోలీసు సిబ్బందికి నివాస గృహాలు లేవు. ఎంఈవో లేకపోవడంతో విద్యావ్యవస్థ గాడి తప్పుతుంది. ఎంపీడీవో కార్యాలయానికి సొంత భవనం లేదు. ప్రస్తుతం ఎంఈవో ఇన్‌చార్జిగా ఉండడంతో పర్యవేక్షణ అంతగా లేదు.

సమస్యలు తీరలే

నార్నూర్ ఉమ్మడి మండలంలోని గాదిగూడను కొత్త మండలాన్ని ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషించారు. కానీ గ్రామాల్లో తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. మండలంలో అభివృద్ధి కానరావడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకుని నూతన భవనాలు మంజూరు చేయించి త్వరగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


బీసీ వసతి గృహంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్


గాదిగూడ తహసీల్దార్ కార్యాయం

నూతన భవనాలు నిర్మించాలి

గాదిగూడ మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదు. పురాతన భవనంలో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అధికారులు ఏదైనా సమావేశాలు నిర్వహించాలంటే ఆరుబయటే నిర్వహిస్తున్నారు. నూతన భవనాలు నిర్మించాలి. – పర్సురాం, గాదిగూడ

చర్యలు తీసుకోవాలి

గాదిగూడ మండలంలో సమస్యలు పరిష్కరించాలి. కొత్త భవనాలు నిర్మించి కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. మండలాన్ని అభివృద్ధి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – భీంరావు, గ్రామ పటేల్ గాదిగూడ

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా

మండలంలో నూతన భవనాలతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ దృష్టి తీసుకెళ్తా. ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో మరింత అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటాం. అందరి భాగస్వామ్యంతో మండలాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తాం. – అడ చంద్రకళరాజు, ఎంపీపీ, గాదిగూడ

దర్జాగా దందా

- నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపుల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు

నేరడిగొండ: అడిగేవారే లేకపోతే అక్రమ వ్యాపారానికి అడ్డేముంటుంది. నియోజకవర్గంలో మెడికల్ షాపుల నిర్వహణ అలాగే ఉంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు సిండికేట్‌గా మారి జనాన్ని దోచుకుంటున్నారు. అమాయక ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.

నిబంధనలకు నీళ్లు..

మెడికల్ షాపులు ఏర్పాటు చేసేవారు నిబంధనలు తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మెడికల్ షాపు ఏర్పాటుకు ఉత్తీర్ణత సర్టిఫికెట్‌తోపాటు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. అయితే ఇవేమి లేకుండానే మెడికల్ షాపు ప్రారంభించి వారు చాటుమాటుగా గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం చేస్తున్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో సుమారు 200 వరకు మెడికల్ షాపులు ఉన్నాయి. ఇందులో చాలా వరకు నిబంధనలు పాటించడం లేదు. అంతేకాకుండా అర్హత లేనివారు కూడా డ్రగ్ ఫార్మసి సర్టిఫికెట్లు అద్దెకు తీసుకుంటూ లైసెన్సులు పొంది షాపులు నిర్వహిస్తున్నారు. ఆయా షాపులకు వివిధ డ్రగ్ ఏజెన్సీల రిప్రజెంటేటివ్‌లు వచ్చి అవసరమున్నా, లేకున్నా మందులను అక్కడక్కడా సరఫరా చేసి ప్రతీనెలా వసూళ్లు చేస్తున్నారు. ప్రతీ షాపులో వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అందిస్తున్నారు. అందుబాటులో ఉన్న సాధారణ ఎంబీబీఎస్, ఆర్ఎంపీలతో చికిత్సలు నిర్వహిస్తూ ఏకంగా మెడికల్ షాపుల ఎదుట నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులు అంటూ బోర్డులు తగిలించి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మెడికల్ షాపులు తనిఖీ చేసి, నిబంధనలు పాటించని యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీ చేపట్టాలి

మెడికల్ షాపులను ప్రతీనెలా తనిఖీలు చేపట్టాలి. అధికారుల పర్యవేక్షణ లేక నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మందులు కొనుగోలు చేసిన వారికి విధిగా బిల్లులు ఇవ్వాలి. – పెరమండ్ల సురేశ్, నేరడిగొండ

చర్యలు తీసుకోవాలి

నిబంధనలు పాటించకుండా నకిలీ మందులు అమ్మి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. శాంపిల్స్ మందులు విక్రయించే షాపులు సీజ్‌చేయాలి. అధికారులు ప్రత్యేక చొరవతో పనిచేయాలి. – సాంబన్న, వాగ్దారి

ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వొద్దు

మెడికల్ షాపు నిర్వాహకులు వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వొద్దనే నిబంధనలు ఉన్నా అవి పాటించడం లేదు. నకిలీ మందులు, శాంపిల్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే డ్రగ్ కంట్రోల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – శ్రీలత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

వాఘాపూర్ సబ్‌సెంటర్ పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సర్ఫరాజ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి పీహెచ్‌సీ పరిధిలో గల మావల మండలంలోని వాఘాపూర్ సబ్ సెంటర్‌ను మంగళవారం పీహెచ్‌సీ వైద్యులు సబ్ సెంటర్‌ను పరిశీలించారు. ఆదిలాబాద్ ఉమ్మడి మండల వైద్యాధికారి డాక్టర్ సర్ఫరాజ్ మాట్లాడుతూ ఈనెల 15న వాఘాపూర్ సబ్ సెంటర్‌ను ఎన్‌కాస్ ఢిల్లీ బృందం తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. రికార్డులు, రోగులకు అందుతున్న సేవలు, పరిసరాలు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే సబ్‌సెంటర్‌ను పరిశీలించినట్లు తెలిపారు. పర్యవేక్షకులు సురేష్, బొమ్మెత సుభాష్, సిబ్బంది ఉన్నారు.

బానోత్ గోదావరికి సన్మానం


సన్మానిస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

నార్నూర్: స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, సరస్వతి దంపతుల రెండో కుమార్తె గోదావరి కేంద్ర విద్యాలయం చైన్నైలో ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం దళిత సంఘాల జేఏసీ నాయకులు దళితరత్న అవార్డు గ్రహీత నర్సింగ్‌మోరే, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావు దుర్గే, షెడ్యూల్ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు దుర్గే మహేందర్‌లు ఆమెను సన్మానించారు. గోదావరి తొలి ప్రయత్నంలోనే కేంద్ర విద్యాలయం చైన్నైలో ఉపాధ్యాయురాలిగా ఎంపికకావడం గర్వంగా ఉందన్నారు. మాజీ ఎంపీటీసీ రమేశ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న లింబాజీ మహరాజ్

బోథ్: సామూహిక జన కల్యాణార్థం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిగిని పంచాయతీ పరిధిలోని కైలాస్ టెకిడిలో సర్వదేశ్వర శివాలయంలో లింబాజీ మహరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం పూజలు చేశారు. గణపతిపూజ, గోపూజ, యాగశాల వ్యవస్థీకరణ, పుణ్యావాదనం, బీజాంకురణ్ మండల పూజ, అగ్ని స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నగేశ్

బోథ్: మండలంలోని అందూర్ గ్రామంలో పెద్దకర్మ కార్యక్రమానికి మాజీ ఎంపీ నగేశ్ హాజరయ్యారు. తర్వాత అనారోగ్యానికి గురైన కొత్తపల్లె గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ కనక శ్యాంరావ్, బోథ్ సీహెచ్‌సీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మడావి లీలాబాయి, మడావి జంగు బాయిలను పరామర్శించారు. వారి ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచులు సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ జుగాదిరావ్, ఇమ్రాన్, సత్యనారాయణ, బాపూరావ్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తలమడుగు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సురేందర్ అన్నారు. మండలంలోని కుచులాపూర్‌లో మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లను పిల్లలకు ఇవ్వకూడదని అన్నారు. ఫోన్లకు ఎలాంటి బ్యాంకు సంబంధించిన విషయాలు షేర్ చేయవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని అన్నారు. సర్పంచ్ ప్రభ, దేవ్‌రావు, సుంకిడి సర్పంచ్ గెల్ల మహేందర్ యాదవ్, గ్రామస్తులు జక్కుల మహేందర్, గణేశ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన అనిల్ జాదవ్


కేటీఆర్‌తో అనిల్‌జాదవ్

నేరడిగొండ/ఇచ్చోడ: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బోథ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్‌జాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్‌జాదవ్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషిచేస్తానని తెలిపారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన జాన్సన్‌నాయక్ సైతం కేటీఆర్‌ను కలిశారు.


జగదాంబ దేవికి మొక్కు తీర్చుకుంటున్న అభిమానులు

మొక్కు తీర్చుకున్న అభిమానులు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యేగా అనిల్ జాదవ్ గెలుపొందడంతో బొరిగాం పంచాయతీ పరిధిలోని సేవాదాస్‌నగర్ గ్రామస్తులు, అభిమానులు మంగళవారం జగదాంబ దేవికి మొక్కులు చెల్లించుకున్నారు. గుగ్లోత్ నగేశ్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్‌లో ఏడుగురు అభ్యర్థుల డిపాజిట్ గల్లంతు

బోథ్: బోథ్ అసెంబ్లీ స్థానానికి పోటీచేసిన పది మంది అభ్యర్థుల్లో ఏడుగురు అభ్యర్థుల డిపాజిట్ గల్లంతైంది. ఈ ఎన్నికల్లో అనిల్ జాదవ్ (బీఆర్ఎస్) గెలుపొందగా, సోయం బాపూరావ్ (బీజేపీ) రెండవ స్థానంలో, ఆడె గజేందర్(కాంగ్రెస్) మూడవ స్థానంలో ఉన్నారు. కాగా, ఎన్నికల నామినేషన్ వేసే సమయంలో ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు రూ.5 వేలు, జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎన్నికలు ముగిసిన తర్వాత డిపాజిట్ దక్కించుకోవాలంటే నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లలో 6వ వంతు ఓట్లు అభ్యర్థులకు దక్కించుకోవాలి. అంటే 16.6666667 శాతం ఓట్లు అభ్యర్థులకు పోలవ్వాలి.

నియోజకవర్గంలో

బోథ్ నియోజకవర్గంలో మొత్తం 2,08,048 ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ కలిపి మొత్తం 1,74,018 ఓట్లు పోలయ్యాయి. కాగా, అభ్యర్థులు పోలైన ఓట్లలో ఆరో వంతుగా 29,003 ఓట్లు సాధించాలి. బోథ్‌లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రమే ఆరోవంతు ఓట్ల కన్నా ఎక్కువ ఓట్లు దక్కించుకున్నారు. మినహా మిగిలిన ఏడుగురు అభ్యర్థులు ఆరోవంతు ఓట్లు సాధించకపోవడంతో తమ డిపాజిట్ కోల్పోవాల్సి వచ్చింది.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కైలాస్‌నగర్: సీఎంగా రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంపై ఆపార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రజా సేవాభవన్ వద్ద మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి స్వీట్లు తినిపించుకుని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారని, ఇది శుభపరిణామమని తెలిపారు. నాయకులు బాలురి గోవర్ధన్‌రెడ్డి, గిమ్మ సంతోష్, కొండూరి రవి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


సంబరాల్లో నాయకులు

బాబోయ్ గ్రామసింహాలు



తలమడుగు: మండలంలోని ఆర్లి(కే) గ్రామంలో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లుపై అవి పదుల సంఖ్యలో గుంపులుగా సంచరిస్తున్నాయి. ప్రజలు, చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. రోడ్డుపై రావాలంటే గ్రామస్తులు జంకుతున్నారు. అధికారులు పట్టించుకోవాలని వారు కోరుతున్నారు.

యూడైస్‌పై హెచ్‌ఎంలకు శిక్షణ

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూడైస్‌పై మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు బొమ్మిడి మహేశ్వర్ యూడైస్ గురించి అవగాహన కల్పించి హెచ్‌ఎంల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కడెం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీలు తదితరులున్నారు.


శిక్షణలో పాల్గొన్న హెచ్‌ఎంలు

కొండగట్టుకు పాదయాత్రగా బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన బీజేపీ యువ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కొండగట్టుకు పాదయాత్రగా బయల్దేరారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా పాయల్ శంకర్ ఎన్నికైతే కొండగట్టు వరకు పాదయాత్ర చేస్తానని నాయకులు మొక్కుకున్నారు. ముందుగా పాయల్ శంకర్‌ను కలిసిన అనంతరం బయల్దేరి వెళ్లారు. అదేవిధంగా మహాలక్ష్మివాడ కాలనీలో పలువురు నాయకులు ఆంజనేయస్వామి భారీ విగ్రహం ఎదుట 101 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కు చెల్లించుకున్నారు. నాయకులు కేమ శ్రీకాంత్, రాకేశ్, సాయి, నరేశ్, సాయిగౌడ్, స్వప్నిల్ తదితరులు ఉన్నారు.


కొబ్బరికాయలు కొడుతున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్ ఎమ్మెల్యేకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాయల్ శంకర్‌ను మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సన్మానించారు. శాంతినగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన సంఘ నాయకులు పూలమాల, శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బోండ్ల నారాయణ, ఉపాధ్యక్షులు శ్రీరాంశర్మ, దుర్గా వాహిణి ప్రముఖ్ రజనీ, బండారి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను సన్మానిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సమష్టి కృషితోనే పాయల్ విజయం

జైనథ్: బీజేపీ కార్యకర్తల, నాయకుల సమష్టి కృషితోనే పాయల్ శంకర్ విజయం సాధ్యమైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడుసార్లు వరుసగా ఓటమి చవిచూసిన పాయల్ శంకర్ ప్రజల పక్షాన నిలబడి పోరాడారని తెలిపారు. అలాంటి వ్యక్తిని గెలిపించిన ఆదిలాబాద్ ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ లోక కరుణాకర్‌రెడ్డి, నాయకులు సామ రాకేశ్‌రెడ్డి, సామ రమేశ్‌రెడ్డి, లస్మన్న యాదవ్, బండి రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కట్కం రాందాస్

మృత్తికను సంరక్షించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: మానవ మనుగడకు మృత్తికనే కీలకమని దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అచ్చ శ్రీనివాస్ అన్నారు. కళాశాల వృక్ష శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మృత్తి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృత్తికి పరిరక్షణలో విద్యార్థులు తమవంతు పాత్రను పోషించాలన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ జాకీర్, అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్, ప్రతాప్, రఘునాథ్, విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోడ్ ప్రోగ్రాం ఆఫీసర్ దయాకర్, ఆష్రాఫ్ పాల్గొన్నారు.

కేవీకే ఆధ్వర్యంలో..

కృషి విజ్ఞాన కేంద్రంలో ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నేలలు సారవంతంగా లేకపోవడంతో పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. నేలలను కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. సేంద్రియ, పచ్చి రొట్టె ఎరువును వాడటం, కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా నేలలు సారవంతమవుతాయన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్, సునీల్ కుమార్, మమత, శివచరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

విద్యార్థినులు చదువుపై దృష్టి సారించాలి

నేరడిగొండ: విద్యార్థినులు చదువుపై దృష్టిసారించాలని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులు బోధించే తీరును ప్యానల్ టీమ్ సభ్యులు పరిశీలించారు. విద్యార్థుల ద్వారా పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థినులు శ్రద్ధగా వినాలన్నారు. ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు, బృందం సభ్యులు తదితరులు ఉన్నారు.


విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ప్యానల్ టీమ్ సభ్యులు

అంబేద్కర్ మహా పరినిర్వాణ్ జయప్రదం చేయండి

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని బుధవారం నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహా పరినిర్వాణ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీంరావు వాఘ్మారే పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ చౌక్‌తోపాటు బస్టాండ్ ప్రాంతంలో జరిగే మహాపరినిర్వాణ్ కార్యక్రమానికి బౌద్ధ ఉపాసికులు, అంబేద్కర్ వాదులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు ఉద్ధవ్ సూర్యవంశీ, దయాశీల్, రమాబాయి, కాంతరావు, రంగారావు, లక్ష్మణ్ తదతరులు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ వర్ధంతి

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో బుధవారం బీఆర్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించనున్నట్లు అంబేద్కర్ మెమోరియల్ అసోయేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ తెలిపారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

బోర్లకుంట జాతర ప్రారంభం

తాంసి: భీంపూర్ మండలం నిపాని సమీపంలో దవల్ మాలిక్ బాబా (బోర్లకుంట) జాతర మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజులు జరిగే జాతరలో భాగంగా గ్రామాల నుంచి నుంచి తరలివచ్చిన భక్తులు దర్గా వద్ద మొక్కు చెల్లించుకుంటున్నారు. ప్రత్యేకంగా కిచిడి, మలిదను తయారు చేసి సమర్పిస్తున్నారు. దర్గా వద్ద కమిటీ అధ్యక్షుడు ఖాశీం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

నేడు అన్నదానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ బుధవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతలు ఇచ్చే విరాళాలు ఆలయకమిటీ సభ్యులకు ఇవ్వాలని కోరారు.

నేడు పత్తి కొనుగోళ్లు బంద్

బోథ్: తుఫాను ప్రభావం కారణంగా బోథ్ మార్కెట్ పరిధిలోని బోథ్, సొనాల, పొచ్చరలోని సీసీఐ ఆధ్వర్యంలో బుధవారం పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవన్న తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అందుబాటులో శనగ విత్తనాలు

తాంసి: ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో యాసంగి సాగుకు అవసరమైన శనగ విత్తనాలను అందుబాటులో ఉన్నాయని సీఈవో కేశవ్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనాలు కావల్సినవారు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.